క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

హనుమంతునిపాడు: మండలంలోని హనుమంతాపురం పంచాయతీ పరిధి నారాయిపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, హనుమంతునిపాడు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ పి.సరోజిని గురువారం తనిఖీ చేశారు. నారాయిపల్లి అంగన్‌వాడీ కేంద్రం టీచర్ దుర్గ చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం ఇవ్వడం లేదని ఫిర్యాదు మేరకు విచారణకు వచ్చామన్నారు. అయితే సెంటర్‌లో రికార్డులు సక్రమంగానే ఉన్నాయని, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. హనుమంతునిపాడులోని రెండు సెంటర్లను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న మెనూపరిశీలించారు.

సీవీ రామన్ విగ్రహ ఆవిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్ఎం, మోషే

కనిగిరి రూరల్: పట్టణంలోని చింతలపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సర్ సీవి రామన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు జి.మోషె ఆర్థిక సౌజన్యంతో అందించిన సీవీ రామన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆవిష్కరించారు. విగ్రహాన్ని పూర్వపు విద్యార్థి ఎస్ సుకుమార్ రూపొందించడం విశేషం. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మూలే బైరెడ్డి, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సభ్యుల వివరాలు నమోదు చేయాలి

కనిగిరి రూరల్: మెప్మా సంఘాల సభ్యుల వివరాలను కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మెప్మా పీడీ తేళ్ల రవికుమార్ అన్నారు. పట్టణంలోని పాతూరులో మెప్మా సంఘాల సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించి, అనంతరం ఆర్పీలు సేకరిస్తున్న వివరాల తీరును ఆయన పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 30వ తేదీ వరకు ప్రతి ఆర్పీ తన పరిధిలోని గ్రూపుల్లో రోజు రెండు గ్రూపుల వివరాలను నమోదు చేయాలన్నారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎస్ రమణమ్మ, సీఎల్ఆర్పీ దీప్తి, పట్టణ సమాఖ్య కార్యదర్శి రాధమ్మ, మెప్మా సిబ్బంది పుష్ప, హనీఫా, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువులను రక్షించుకుందాం

కనిగిరి రూరల్: నవ జాత శిశువును రక్షించుకుందా.. భవిష్యత్‌ను కాపాడుకుందాం అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వైద్య శాల అవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ యువీ నారాయణరెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, నవకుమార్, గర్భిణులు, బాలింతలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు, టీడీపీ నేతలు బెదిరిస్తున్నారు..

మద్దిపాడు: బాతు పిల్లల కోసం తాను ఇంటింటికీ బియ్యం కొనుగోలు చేస్తానని, అయితే కూచిపూడి డీలర్ బియ్యం అమ్మాడని చెప్పాలని టీడీపీ నాయకులు, పోలీసులు వత్తిడి తెస్తున్నారని జువ్విగుంటకు చెందిన ఎరుకుల కోటయ్య వాపోయారు. వివరాల్లోకి వెళితే..ఈ నెల 5న కూచిపూడి శివారులో రేషన్ బియ్యాన్ని ట్రాలీ ఆటోలోతీసుకువెళుతుండగా ఎరుకల కోటయ్యను పోలీసులు పట్టుకొని బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇదే అదునుగా భావించిన టీడీపీ నాయకులు ఎలాగైన వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడైన కూచిపూడి డీలర్ మాచేపల్లి హనుమంతరావు రేషన్‌దుకాణంపై 6ఏ కింద కేసు నమోదు చేయాలని పన్నాగం పన్నారు. ఈ రేషన్ బియ్యం కూడిపూడి డీలర్ ఇచ్చారని చెప్పాలని ఒత్తిడి తెచ్చారని కోటయ్య గురువారం మీడియా ముందు వాపోయాడు. రేషన్ బియ్యానికి కూచిపూడి డీలర్‌కు ఎలాంటి సంబంధం లేదని, బాతుపిల్లలను బతికించుకునేందుకు నేనే ప్రతి ఇంటికి వెళ్లి బియ్యం కొనుగోలు చేసి తీసుకెళ్లే క్రమంలో పోలీసులకు పట్టుబడ్డానని తెలిపాడు.

➤ అయితే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్, టీడీపీ నేతలతో కలిసి డీలర్ హనుమంతరావు ఇంటికి వెళ్లారు. రేషన్ సరుకులుఇచ్చే మిషన్ ఇవ్వాలని ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ సమయంలో కార్డుదారులు అక్కడకు రావడంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. అయితే రేషన్ దుకాణంలో సరుకులు పరిశీలించకుండానే అక్రమంగా 6ఏ కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ దొరికింది..!

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని కామేపల్లి గ్రామ పంచాయతీలో ఈనెల 4వ తేది రాత్రి ప్రత్తిపాటి నరశింహారావు తన కొష్టాంలో పెట్టిన ట్రాక్టరు చోరీ జరిగిన సంఘటన పాఠకులకు విదితమే. ఈ ట్రాక్టరును బుధవారం మద్దిపాడు మండలం మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన ట్రాక్టర్‌లో డీజిల్ అయిపోవటంతో దొంగలు వదిలేసి వెళ్లారు. ఈ విషయాన్ని మేదరమెట్ల పోలీసులు జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించటంతో నరసింహారావు మేదరమెట్ల వెళ్లి ట్రాక్టరును తీసుకుని వచ్చి జరుగుమల్లి పోలీసులకు అప్పగించారు.

ఆదాయం ఘనం..

వసతులు శూన్యం



కొండపి ఆర్టీసీ బస్టాండ్



ఒక్క ఫ్యాన్ కూడా లేని బస్టాండ్

- కొండపి ఆర్టీసీ బస్టాండ్‌లో వసతుల లేవి
- నిరుపయోగంగా మంచినీటి ట్యాంకు
- కనీస సౌకర్యాలు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

కొండపి: నియోజకవర్గ కేంద్రమైన కొండపి ఆర్టీసీ బస్టాండ్‌లో వసతుల లేమితో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. నిత్యం వేల మంది ప్రయాణం సాగించే ఈ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో ప్రయాణికుల ఇక్కట్లు చెప్పేవీ కావు. కనీసం ప్రయాణికులు కూర్చుకునేందుకు సరైన బెంచీలు కూడా ఇక్కడ లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నిత్యం వేలాది మంది ప్రయాణం..

కొండపి బస్టాండ్‌కు ఒంగోలు నుంచి టంగుటూరు మీదుగా 28 ట్రిప్పులు, ఒంగోలు నుంచి మద్దులూరు మీదుగా 28 ట్రిప్పులు, కందుకూరు నుంచి 5 ట్రిప్పులు, పొదిలి నుంచి కొండపికి 6 ట్రిప్పులు చొప్పున రోజుకి 67 ట్రిప్పులు బస్సులు తిరుగుతుంటాయి. ఒక్క బస్సుకు కనీసం సఘటున 30 మంది ఎక్కినా 2 వేల మందికి పైగా ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు. కొండపి బస్టాండ్ నుంచి ఆర్టీసీకి రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా ప్రయాణికులకు సౌకర్యాల కల్పనలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

సౌకర్యాల లేమితో సతమతం..

నిత్యం వేల మంది ప్రయాణికులు బస్టాండ్‌కు వస్తుంటారు. కానీ ప్రయాణికులు కూర్చునేందుకు బల్లలు కూడా లేకపోవడంతో నిలువు కాళ్ల మీదే గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి. ఉన్న ఒకటి రెండు బల్లలు కూడా మరమ్మతులకు గురయ్యాయి. వాటికి కనీస మరమ్మతులు చేయలేదు. ఇక ఫ్యాన్ అనేది ఈ బస్టాండ్‌లో ఎప్పుడూ చూడలేదని ప్రయాణికులంటున్నారు. విడి రోజుల్లో ఎలా ఉండే ఎండాకాలం ఉక్కపోత రోజుల్లో ఫ్యాన్ కూడా లేకపోవడంతో ప్రయాణికులు చెమటలు కక్కుతూ బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. వేసవిలో కొన్ని రోజులు 40 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదమవుతూ ఉంటాయి. ఆ సమయంలో బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులు కనీసం ఫ్యాన్ సౌకర్యం కూడా లేకపోవడంతో నరకం అనుభవించే పరిస్థితి. ఇక దాహం వేస్తే తాగేందుకు చుక్క నీరు కూడా అందుబాటులో ఉండని పరిస్థితి ఇక్కడ ఉంది. ఉన్న మంచినీటి ట్యాంకు నిరుపయోగంగా మారింది. కాస్త స్తోమత ఉన్నత వాళ్లు రూ.10, రూ.20చెల్లించి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేస్తారు. కానీ పేద, మధ్య తరగతి కూడా దాహంవేసినా ఏం చేయలేని పరిస్థితి. కనీసం బస్టాండ్‌లో మంచినీటి సౌకర్యమైనా కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఏళ్ల తరబడి ఈ బస్టాండ్ గురించి అధికారులు పట్టించుకోలేదు. దీంతో వసతుల లేమితో కునారిల్లుతోంది. ప్రయాణికులు కూడా బస్టాండ్‌లో సౌకర్యాల కల్లేనని నిట్టూరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్లో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.



ప్రయాణికులు కూర్చోవడానికి వేసిన విరిగిపోయిన బల్ల



నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

పామూరు: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ప్రజాపోరు కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ కుల మతాలను రెచ్చగొట్టి రాజకీయాలు చేస్తున్నారని, ఇలాంటి వారికి గుణపాఠం చెప్పాలన్నారు. ఈనెల 15వ తేదీన తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. వీరనారాయణ, సయ్యద్ గౌస్‌బాషా, ఎస్‌కే.ఖాదర్‌బాషా, ఎం.రామయ్య, కే.శంకర్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

ఆరోగ్య సూత్రాలు పాటిస్తే శిశుమరణాలకు అడ్డుకట్ట

పామూరు: గర్భిణులు, చిన్నపిల్లల తల్లులు ఆరోగ్య సూత్రాలు పాటిస్తే శిశుమరణాలను అరికట్టడం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని వగ్గంపల్లె ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన నాటి నుంచి 1000 రోజు లవరకు పిల్లల సంరక్షణ ఎంతో కీలకమైందని, రెండేళ్ల వరకు చిన్నారుల పెరుగుదల, ఆరోగ్యం అత్యంత కీలకమన్నారు. బిడ్డపుట్టిన నాటి నుంచి 6 మాసాల వరకు తల్లిపాలు ఇవ్వాలని, ఆ తరువాత ఆహారంలో పోషకాలు జోడించి ఇవ్వాలన్నా రు. అంగన్‌వాడీ కార్యకర్త ఎల్.శ్రీదేవి, నారాయణమ్మ, గర్భిణులు, చిన్న పిల్లల తల్లులు పాల్గొన్నారు.



చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి

నూరుశాతం అక్షరాస్యతే ఉల్లాస్ లక్ష్యం

జరుగుమల్లి(సింగరాయకొండ): గ్రామీణ మహిళల్లో నూరుశాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ఉల్లాస్ పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం ఉల్లాస్ పథకంపై మొదటి దశ వలంటీర్ల శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పథకం కింద మొదటి దశలో 523 మంది మహిళలను అక్షరాస్యులుగా చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఎం డి.జయరాజ్, ఎంఈఓ బి.నాగేంద్రవదన్, పర్యవేక్షకుడు రామన వెంకటేశ్వరరెడ్డి, కమ్యూనిటీ కో ఆర్డినేటర్స్, వీఓఏ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు

ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధి చేద్దాం

కనిగిరి రూరల్: ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం చైర్మన్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన సమావేశం మందిరంలో నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్, సచివాలయ అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలన్నారు. కౌన్సిల్ సభ్యులు తెలిపిన సమస్యలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. తాను అకస్మిక తనిఖీలు చేస్తానని, మున్సిపల్ ప్రజా ప్రతినిధులు కూడా అకస్మిక తనిఖీలు చేయాలన్నారు. సచివాలయాల్లో ఉద్యోగులు ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. సకాలంలో స్పందించకపోయినా.. తక్షణ వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఒకరిద్దరు సభ్యులు పలు సమస్యలను ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, చైర్మన్ గఫార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మూడవ వార్డు కౌన్సిలర్ దివంగత పెన్నా నాగమ్మ మృతికి కౌన్సిల్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు తీవ్ర సంతాపం తెలిపారు. అనంతరం సుమారు రూ.10 లక్షల విలువైన పుష్ కార్ట్స్, డంబర్ బిన్స్, చెత్త డబ్బాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, చైర్మన్ గఫార్ చేతుల మీదుగా ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసఫ్, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్ రెడ్డి, రాచపుడి మాణిక్యరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

48 అంశాల అజెండాలపై మమ

గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలోని 48 అంశాల అజెండాపై మమ అనిపించారు. 48 అంశాలకు సంబంధించి సుమారు 1.70 కోట్ల నిధులకు మున్సిపల్ బాడీ ఎటువంటి చర్చ లేకుండా ఆమోదం తెలిపినట్లు అయ్యింది. 48 అంశాల్లో సుమారు రూ.40 లక్షలకు సంబంధించి కార్మికుల జీతాలు, పారిశుధ్యానికి సంబంధించి డస్ట్ బిన్‌లు వగైరా ఉండగా.. మిగతా మొత్తం అంశాల్లో ఒకటి రెండు మినహా దాదాపు మొత్తం ఇంజనీరింగ్ విభాగంకు చెందినవే కావడం విశేషం. అంటే సుమారు రూ.1.30 కోట్ల పనులపై కనీస చర్చ లేకపోవడంపై పట్టణంలో తీవ్ర చర్చ జరుగుతుంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, పక్కన వేదికపై చైర్మన్ గఫార్

శిక్షణ నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించాలి

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో డివిజన్ కేంద్రాల్లోనే నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అరియారం సురేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు నారిశెట్టి వెంకటరామయ్య, షేక్.పాదుషా అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై పనిభారం తగ్గలేదన్నారు. ఒక దేశం ఒక నంబర్ అనే నినాదంతో కేంద్రప్రభుత్వం చేపట్టిన అపార్ కార్డులు పూర్తి చేసేందుకు ఇచ్చిన నిర్దిష్ట సమయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. యాప్‌లలో వివరాల నమోదు హెచ్ఎంలకు భారంగా మారిందన్నారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసి ఉపాధ్యాయులను నియమించినా ఇంకా కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటుపడి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

సీఎస్‌పురం(పామూరు): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి.రఘుపతి, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవిద్య అన్నారు. జాతీయ సేవా పథకం ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గురువారం కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల 4వ సంవత్సర విద్యార్థులు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేయడం, రహదారులు శుభ్రం చేసి బ్లీచింగ్ నిర్వహించారు.

మహిళల్లో అక్షరాస్యత శాతం పెంచాలి

మద్దిపాడు: మండలంలో 50 ఏళ్ల దాటిన మహిళలకు అక్షరాస్యత శాతం పెంచాలని అడల్ట్ ఎడ్యుకేషన్ పర్యవేక్షకుడు గాయం వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వలంటీర్ టీచర్ల శిక్షణలో ఆయన మాట్లాడారు. మొదటి విడతగా గుండ్లస ముద్రం, రేగలగడ్డ, సన్నమూరు, జువ్విగుంట,రావిళ్లవారిపాలెం గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఎంఈఓ ఈవీఎం రంగయ్య, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు

కనిగిరి రూరల్: విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేస్తే తగిన గుర్తింపు వస్తుందని మెప్మా పీడీ తేళ్ల రవికుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏరియా కో ఆర్డినేటర్‌గా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న కత్తి కల్యాణ్ వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. నూతన ఏరియా కో ఆర్డినేటర్ అంబేడ్కర్, ఆరు మండలాల ఏపీఎంలు, సీసీలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

సీఎస్‌పురం(పామూరు): భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ మంజునాథరెడ్డి అన్నారు. సమగ్ర భూ రీసర్వే జరిగిన మండలంలోని కోవిలంపాడులో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా కోవిలంపాడు రెవెన్యూ పరిధిలో గతంలో జరిగిన రీసర్వే వివరాలను గ్రామసభలో వివరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రీసర్వేతో భూముల విస్తీర్ణం హద్దులు ఏర్పరచి రికార్డుల్లో నమోదు చేసినట్లు తెలిపారు. రైతుల భూములు ఒకరివి మరొకరి పేరుతో నమోదై ఉన్నా, హద్దురాళ్ల ఏర్పాటులో పొరపాటు జరిగి ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ తిరుపతయ్య, సచివాలయ సర్వేయర్, సర్పంచ్ ఖాదర్‌బీబుజ్జి, నాయకులు దుగ్గిరెడ్డి జయరెడ్డి, రజ్జబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

కనిగిరి రూరల్: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఏడీఏ ఈ వెంకట రమణ అన్నారు. మండలంలోని పోలవరం, తుమ్మగుంట గ్రామాల్లో గురువారం పొగాకు రైతులకు అవగాహన కార్యక్రమం ఏఓ పీ జోత్స్నాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకట రమణ మాట్లాడుతూ పొగాకు పంట ఎక్కువగా సాగు చేయడం వల్ల టి వేరు వ్యవస్థ భూమిపై పొరలో సారవంతమైన మట్టిని కదిలించి తద్వారా భూమి కోతకు గురవుతుందన్నారు. ఫలితంగా భూమి పొరల్లోని పోషకాలు దెబ్బతింటాయని వెల్లడించారు. పొగాకు బోర్డు వేలం కేంద్రం సూపరిండెంట్ కోటేశ్వరావు మాట్లాడుతూ బోర్డు నిర్ణయించిన మేరకే సాగు చేయాలని సూచించారు. ఏఓ జోత్స్నాదేవి మాట్లాడుతూ పొగాకు రైతులు ప్రత్యామన్య పంటల సాగుగా చిరు ధాన్యాలు, లేదా పప్పు జాతి పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖలోని అమలు జరుగుతున్న పథకాల గురించి వివరించారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది, వ్యవసాయ సహాయకులు ఎస్‌కే మహబూబ్ ప్యారీ, ఎస్‌కే షబానా, రైతు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ వెంకట రమణ

సర్వేలో అలసత్వం వద్దు

సింగరాయకొండ:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కిల్ సెన్సెస్ కార్యక్రమం జయప్రదం చేయాలని ఎంపీడీఓ డి. జయమణి గ్రామ సచివాలయ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్కిల్ సెన్సెస్ కార్యక్రమంపై సచివాలయ అధికారులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ జయమణి మాట్లాడుతూ సచివాలయ అధికారులు అలసత్వం వహించకుండా ఇంటింటి సర్వే నిర్వహించి 15 నుంచి 59 ఏళ్ల వయసున్న నిరుద్యోగ యువత వివరాలు సేకరించాలన్నారు. వారి వద్ద నుంచి విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, మెరుగైన ఉద్యోగ ఆసక్తి తదితర అంశాలను సేకరించాలన్నారు. గ్రామాల్లో అధికారులు సమయపాలన పాటించడం లేదని, బయటకు వెళ్లేటప్పుడు రిజిష్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ జీవీ కృష్ణారావు, ఈఓపీఆర్డీ సుధాకర్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సుల్తాన్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

టంగుటూరు:

రాష్ట్రస్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు మర్లపాడు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు నరసరాజు తెలిపారు. గత నెల 26న చీమకుర్తిలో జరిగిన అండర్-14 బేస్‌బాల్ పోటీల్లో ఎం మోహన్‌తేజ, ఎం.మహేంద్ర, ఎస్.జగదీష్, అండర్17 విభాగంలో కె. అరుణ్‌కుమార్, కె.సందీప్ ఎన్నికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 9 నుంచి గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, పీడీ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

హనుమంతునిపాడు: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సందీప్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలు ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. డాక్టర్ సందీప్, డాక్టర్ భార్గవి, సీహెచ్ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు పద్మవతి, బాలుడు, సిబ్బంది భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ, చైర్మన్

కనిగిరి రూరల్: ఇంటి వద్దే క్యాన్సర్‌కు సంబంధించిన రక్త పరీక్షలు ఈనెల 14 నుంచి నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సృజన తెలిపారు. గురువారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం చేపడుతున్న కార్యక్రమాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపరింటెండెంట్ వెంకట సుబ్బయ్య, డాక్టర్లు ప్రియార్శనంద, ఫణికుమార్, ఆరోగ్య సిబ్బంది, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

- మహిళలకు తీవ్రగాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్

మద్దిపాడు: అతివేగంగా వెళుతున్న ట్రాక్టర్ మలుపులో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన మండలంలోని శివరాయునిపేట-వల్లాయపాలెం గ్రామాల మధ్య గురువారం జరిగింది. పొగాకు కూలీలు తెలిపిన సమాచారం మేరకు... మండలంలోని మద్దిపాడు పంచాయతీ గంగపాలెం గ్రామానికి చెందిన వనిపెంట రమణారెడ్డి అతను భార్య కోటేశ్వరమ్మలు ట్రాక్టర్‌లో పొదిలి మండలం ఏలూరులో ఉన్న పొలం వద్దకు వెళ్లారు. పని ముగించుకొని తిరిగి వస్తుండగా శివరాయునిపేట-వల్లాయపాలెం గ్రామాల మధ్యలోని వేమిరెడ్డి అంకిరెడ్డి పొలం సమీపంలో ఉన్న మలుపు వద్దకు చేరుకోగానే అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పింది. దీంతో రోడ్ పక్కనే ఉన్న వంకలో ట్రక్కుతో సహా ట్రాక్టర్ ఇంజన్ పూర్తిగా బోల్తా పడింది. విషయాన్ని గమనించిన సమీప పొగాకు పనులు చేసే కూలీలు ట్రాక్టర్ క్రింద ఇరుక్కుపోయిన భార్య,భర్తలైన రమణారెడ్డి, కోటేశ్వరమ్మలను అతికష్టంమీద బయటకు తీశారు. కోటేశ్వరమ్మకు తీవ్ర గాయాలు కాగా, రమణరెడ్డికి స్వల్పంగా యాలైనట్లు కూలీలు తెలిపారు. పరిస్థితిని గమనించిన కూలీలు 108 వాహనానికి సమాచారం అందించారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.